క్లుప్తంగా

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

సంబేపల్లి : మండల పరిధిలోని గున్నికుంట్ల గ్రామంలోని హెల్త్ సెంటర్‌ను గురువారం క్షయ వ్యాధి నివారణ వైద్యాధికారి రియాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీబీ విభాగాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడం జరిగింది. వ్యాధిగ్రస్తులైన వారికి సకాలంలో మందులు అందుతున్నాయా లేదా అన్న దానిపై ఆరా తీశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ ఏడీఏ నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ ప్రక్రియ పూర్తిని పర్యవేక్షించారు. మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డితో కలిసి బొగ్గిడివారిపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నువ్వుల పంటను పరిశీలించి తెగులును గుర్తించి చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు బొగ్గిడి సందీప్ కుమార్, ప్రేమ్ సందీప్, రైతులు పాల్గొన్నారు.

అఘోరలింగేశ్వరుడికి పూజలు


అలంకరణలో అఘోరలింగేశ్వరుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన అఘోరలింగేశ్వరుడికి మహాశివరాత్రి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి అంతా శివలింగానికి అభిషేక పూజలు జరిపారు. పాలు, తేనె, పెరుగు, నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి పూలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. పూజలు ఆలయ ఈఓ డీవి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, రాచరాయ యోగీ స్వాములు జరిపించారు.

చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి


ఛలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేస్తున్న కురవ సంఘం జిల్లా అధ్యక్షుడు రవిశంకర్

రాయచోటి జగదాంబ సెంటర్ : రాష్ట్రంలో 70 కోట్ల జనాభా ఉన్న బీసీలకు చట్టసభలలో ఎలాంటి ప్రాతినిధ్యం, రిజర్వేషన్ లేకపోవడం అన్యాయమని కురవ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం మార్చి 12, 13 తేదీలలో నిర్వహించబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గురువారం రాయచోటి పట్టణంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా ఉన్న బీసీల కోసం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. జనగణనలో బీసీల కులగణన జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం దక్షిణ భారతదేశ బీసీ సంఘం, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం సంయుక్తంగా ఢిల్లీలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఓబీసీ మేధావుల సదస్సు నిర్వహిస్తోందన్నారు.

భక్తజన సంద్రమైన ఝురి

- పుణ్యస్నానాలు ఆచరించి మల్లికార్జున స్వామిని దర్శించుకున్న భక్తులు
- కోనలో మార్మోగిన శివనామస్మరణ


భక్తులకు దర్శనమిస్తున్న శివలింగస్వరూపుడు


భక్తులతో పోటెత్తిన మండల పరిధిలోని ఝురికోన క్షేత్రం


బహుదా నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సంబేపల్లి : మండల సరిహద్దులో ప్రసిద్ధి గాంచిన శైవ క్షేత్రం ఝురిలో మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. సరిహద్దులలో ఉన్న పవిత్ర బహుదానదిలో మహాశివరాత్రి రోజున పరమశివుని పవిత్రంగా సేవించి ఉపవాస దీక్షలతో జాగారం చేసి ఈ ఝురిలో స్నానం ఆచరిస్తే సర్వ పాపాలు తొలగి, అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఝురికి తరలి వచ్చి అరుణోదయ స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా భక్తులు హరహర మహాదేవా.. శంభోశంకరా.. అంటూ దేవదేవుని స్మరిస్తూ స్నానాలు ఆచరించి ఆదిదేవునికి ప్రణమిల్లారు. వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తండోపతండాలుగా తరలి రావడంతో ఝురి ప్రాంతం జనసంద్రంగా మారింది. అనంతరం సమీపంలోని మల్లికార్జునస్వామి ఆలయంలోని మూల విరాట్ మూర్తికి భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రజలతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏపీఎస్ఆర్‌టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు. చెక్కభజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని మోటకట్ల, సంబేపల్లెలోని శ్రీ వెంకట శివసాయి, గుహేశ్వరి పశుపతినాథ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం రాత్రి మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలోని మూలవిరాట్‌లకు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు దాతల సహకారంతో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నాబిడ్డను కాపాడండి సీఎం సారూ..

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న జ్యోతి
- చికిత్సకు ప్రభుత్వం సహకరించాలంటూ తల్లి సుజాత వేడుకోలు


బాధితురాలు కొప్పు జ్యోతి వద్ద కుటుంబీకులు

సుండుపల్లె : అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తె జ్యోతికి మెరుగైన వైద్యం అందించి కాపాడాలని కొప్పు సుజాత కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. వివరాల్లో వెళ్తే.. సుండుపల్లె మండల పరిధిలోని దిగువ గుబ్బవాండ్లపల్లెకు చెందిన కొప్పు జ్యోతి జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతోందని తెలిపింది. జ్యోతి గత నాలుగు సంవత్సరాలుగా అరుదైన వ్యాధితో బాధపడుతోందన్నారు. పారాఆక్సిస్మల్ నాక్టర్నల్ హిమోగ్లోబిన్ వీక్‌నెస్ (పీఎన్‌హెచ్) కారణంగా తన బిడ్డకు రక్తం గడ్డ కట్టడంతోపాటు బోన్ మ్యారో సమస్య, నరాలు చిట్లడం సమస్యలతో నరక వేదన అనుభవిస్తోందన్నారు. అలానే తలనొప్పి, ఊపిరి తీసుకునేందుకు కూడా అవస్థలు పడుతోండటమే కాక రక్తస్రావం అవుతోందని ఆవేదనను తెలియజేశారు. ఎముకలలో ఇన్ఫెక్షన్ కారణమని వైద్యులు తెలియజేసినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే తన కూతురు చికిత్స కోసం రూ.6 లక్షలు అప్పులు చేశానన్నారు. తనకు ముగ్గురు పిల్లలని, తన భర్త కాలం చేశారని, కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నానని, నా బిడ్డ అనారోగ్యం కారణంగా కూలీ పనికి కూడా వెళ్లడంలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు తన బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని ఆమె ప్రాధేయపడ్డారు. దాతల కూడా ముందుకువచ్చి విద్యార్థి జ్యోతి చికిత్స సహకారం అందించాలని తల్లి సుజాత వేడుకుంటున్నారు.

జాతరలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

లక్కిరెడ్డిపల్లి : మార్చి 1, 2న జరిగే అనంతపురం గంగమ్మ జాతరలో బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లి సీఐ వెంకట కొండారెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన ఎస్‌ఐ రవీంద్రబాబుతో కలిసి జాతర ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అమ్మవారికి చాందినీ బండ్ల మొక్కుబడి ఉన్నవారు నిబంధనలు మేరకు ఎత్తు తగ్గించి కట్టుకోవాలన్నారు. పోలీసుల అనుమతులు తప్పక తీసుకోవాలన్నారు. గంగమ్మ జాతరలో అశ్లీల నృత్య ప్రదర్శనలు, రికార్డు డ్యాన్సులు, మైకులు, సౌండ్ బాక్సులు వంటివి ఏర్పాటు చేసి భక్తులను ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, దొంగతనాలు, మద్యం విక్రయాలు, పేకాట వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, వాహనదారులు పోలీసులకు సహకరించాలన్నారు. సామాన్య భక్తులకు సులభతరంగా అమ్మవారి దర్శనం కల్పించేందుకు ఆలయం ముందు భాగంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటరాగేషన్ పేరుతో పోలీసుల అత్యుత్సాహం

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కూటమి ప్రభుత్వం
- అధికార పార్టీల నేతలకు వత్తాసు పలుకుతున్న పోలీసు యంత్రాంగం


పోలీస్ స్టేషన్‌కు చేరుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు, కార్యకర్తలు

ఓబులవారిపల్లె : పోసాని కృష్ణమురళీని అక్రమంగా అరెస్టు చేసి ఓబులవారిపల్లెకు తరలించారన్న విషయం తెలుసుకున్న జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పెద్దఎత్తున స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి సారథ్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున మండల కేంద్రంలో కాలినడకన ర్యాలీగా వచ్చి స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. పోసాని కృష్ణమురళీని వెంటనే బయటకు పిలిచి అందరికీ చూపించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రభుత్వం కక్షసాధింపుగా అక్రమ కేసులు నమోదు చేసి నాటకీయంగా తెలంగాణలో అరెస్టు చేసి ఇక్కడికి తీసుకు రావడం ఏంటని పోలీసులను ప్రశ్నించారు. కూటమి నేతల ఆదేశాల ప్రకారం పోలీసు వ్యవస్థ పని చేస్తోందని కనీసం నోటీసులు ఇవ్వకుండా పోలీసులు ఎలా అరెస్టు చేస్తారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రశ్నించారు. అరెస్టు చేసిన వ్యక్తిని కోర్టుకు హాజరు పరచకుండా ఇంటరాగేషన్ పేరుతో కూటమి నాయకుల డైరెక్షన్‌లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసులు పోసాని కృష్ణమురళీని చూసేందుకు ఎవరినీ అనుమతించడంలేదని, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వచ్చారని, విచారణ జరుపుతున్నామని, అనంతరం రైల్వేకోడూరు కోర్టుకు హాజరు పరుస్తామని సీఐ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు నచ్చచెప్పి వెనక్కి పంపించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, సర్పంచ్ జైపాల్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు టంగుటూరు కృష్ణారెడ్డి, కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ భరత్ కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, మహిళా నాయకురాలు నారాయణమ్మ, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ


రేషన్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పెనగలూరు : మండల కేంద్రంలోని రేషన్ షాపు - 4, 5లను తహశీల్దార్ అమరేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్ షాపులో రికార్డులను బట్టి బియ్యంతోపాటు ఇతర సరుకులను ఉన్నాయా.. లేదా అని పరిశీలించారు. ఆర్ఐ రాజశేఖర్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సుబ్బరాయుడులతో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. బియ్యం సరఫరా చేసేటప్పుడు స్టాకు కచ్చితంగా చూసుకోవాల్సిన అవసరం డీలర్లపై ఉందని వారు హెచ్చరించారు.

రేపు మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి 1వ తేదీన జరుగునని ఎంపీడీఓ ఫణిరాజకుమారి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10:30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో, మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. అధికారులు, ప్రజాప్రతనిధులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ తెలియజేశారు.

అయ్యవారురెడ్డి స్వామికి పూజలు


భక్తుల విశేష పూజలందుకున్న అయ్యవారురెడ్డి స్వామి (సమాధి)


కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామంలోని పెన్నానది ఒడ్డున జీవ సమాధి అయిన అయ్యవారు రెడ్డి స్వామికి గురువారం వైఎస్ఆర్‌సీపీ మండల అధికార ప్రతినిధి, ఉపాసి వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. మహా శివరాత్రి నాడు శ్రీ నిత్యపూజ స్వామిని దర్శించుకున్న భక్తులు గురువారం అయ్యవారురెడ్డి స్వామిని దర్శించుకుంటారు. భక్తులు స్వామి వారి సమాధి చుట్టూ ప్రదక్షణలు చేసి కాయా, కర్పూరాలను అందించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కొందరు మహిళా భక్తులు పెన్ననదిలో స్నానం చేసి తడిబట్టలతో స్వామి వారి వద్ద సంతానం కోసం వరపడ్డారు. వచ్చిన భక్తులకు అయ్యవారురెడ్డి స్వామి కమిటీ సభ్యులు పి. రమణారెడ్డి, కొండారెడ్డి, శంకర్‌రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి రాజగోపాల్‌రెడ్డి, పూజారి ఎల్లమ్మ, గ్రామ పెద్దలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైభవంగా కపర్దీశ్వరుని కల్యాణం

సిద్దవటం - అట్లూరు మార్గ మధ్యలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ కపర్దీశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితులు రంగయ్యస్వామి మొదట కపర్దీశ్వరస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి కల్యాణ వేడుకను వేదపండితులు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారి ఊరేగింపు, తదనంతరం శ్రీసత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

ఘనంగా భద్రకాళీ సమేత వీరభద్రుడి కల్యాణం


చిట్వేలి: కల్యాణోత్సవాన్ని జరుపుతున్న వేదపండితులు

చిట్వేలి : పాత చిట్వేలిలో వెలసివున్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం స్వామి వార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం పూజాది కార్యక్రమాలు అనంతరం రేనాటి వినాయకరాజు కుమారుడు వెంకటసుబ్బరాజు బృందంచే భక్తి గీతాలాపన, 9 గంటలకు శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, మధ్యాహ్నం జింకా సంజీవ్, ప్రొద్దుటూరు వారిచే అన్నదానం, మావిళ్ల హరీష్, గల్లా సుదర్శన్ రావు, పి ఆనంద్, హిమత్ గిరి, రాజశేఖర్, హరికృష్ణ, దేవరాజులు, తిరుపతి అడ్వకేట్స్ బృందం, టి భీమ్ సేన్ (హైదరాబాదు), టి విశ్వనాథ్, గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ పురోహితులు మృత్యుంజయ స్వామి కార్యక్రమాలను జరిపించారు. అందరి సహకారంతో శివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వేడుకగా తెప్పోత్సవం

సుండుపల్లె : మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ చింతలయ్యగారిపల్లెలో వెలసియున్న శివాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులందరూ గురువారం అంగరంగ వైభవంగా ఆలయ ప్రాంగణంలోని కోనేరులో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో శివపార్వతులకు ఎంతో ఇష్టమైన తెప్పోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేలసంఖ్యలో హాజరై స్వామి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం

నందలూరు : మండలంలో నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి గ్రామోత్సవం గురువారం సాయంత్రం అత్యంత ఘనంగా జరిగింది. ఈ గ్రామోత్సవం గ్రామంలోని రెడ్డివారి వీధి, డిංසీ రోడ్డు, అరవపల్లి మీదుగా బస్టాండ్ కూడలి వరకు కొనసాగింది. గ్రామోత్సవంలో డ్రమ్స్, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉదయం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు వలేకుండా ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏఎస్ఐ సుబ్బరాయుడు, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.


సుండుపల్లె: తెప్పోత్సవంలో పాల్గొన్న భక్తులు


నందలూరు: గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం

మొదలైన అమ్మవారి జాతరల పర్వం

వీరబల్లి : మండలంలోని సోమవరం పంచాయతీలోని సోమవరం వడ్డిపల్లి గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి గంగమ్మ జాతర నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిపారు. మొక్కుబడులు ఉన్న భక్తులు ఛాందినీ బండ్లు కట్టి అమ్మవారి గుడి చుట్టూ ప్రదర్శన తీశారు. గురువారం తెల్లవారుజాము అమ్మవారికి గ్రామస్తులు బోనాల తీసుకెళ్లి సమర్పించారు. జాతరను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

సుండుపల్లె : భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ కూటాలమ్మ తిరునాల సందర్భంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మల్లక్కగారిపల్లె గ్రామానికి సమీపాన వెలసిన కూటాలమ్మకు గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల వెంట మంగళవాయిద్యాలతో అమ్మవారి వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


వీరబల్లి: గంగమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


సుండుపల్లె: సాంస్కృతిక ప్రదర్శనల నడుమ కూటాలమ్మకు బోనాలు తీసుకెళుతున్న మహిళలు

గొప్ప దేశ భక్తుడు 'ఆజాద్'


ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయుడు రమణ చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాటంతోనే స్వాతంత్ర్యం సాధ్యమని నమ్మిన యోధుడు, మీసం మెలిపెట్టి బ్రిటీష్ వారిని గజగజలాడించిన ధీరుడు ఆజాద్ అని, బ్రిటీష్ వారి బుల్లెట్‌కు చనిపోవడం కూడా ఓటమిగా భావించి తన బుల్లెట్‌తోనే కాల్చుకొని స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప దేశభక్తుడని ఆయన కొనియాడారు.